క్లుప్తంగా

ముగిసిన యాగం



కల్యాణమూర్తిగా అగస్త్యేశ్వర స్వామి

పాణ్యం: మండల కేంద్రంలోని వీరనారాయణ స్వామి ఆలయంలో గత 11 రోజులుగా శృంగేరి జగద్గురు పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ తీర్థస్వామి వారి ఆశీస్సులతో పాణ్యం అగస్త్యేశ్వర ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం చేపట్టిన యాగం బుధవారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఆలయంలో మహా రుద్రహననం, పూర్ణాహుతి, అవభృత స్నానం, అన్నపూర్ణ సమేత అగస్త్యేశ్వర స్వామి కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠం నుంచి 11 మంది వేద పండితులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులకు మంచి సేవలు అందించాలి

పాణ్యం: రైతులకు మంచి సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం పాణ్యంలోని మార్కెట్ యార్డులో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలన్నారు. అలాగే మార్కెట్ యార్డు అభివృద్ధికి పాటుపడాలన్నారు. పాణ్యం మార్కెట్‌యార్డు చెర్మన్‌గా దుర్వేశి గ్రామానికి చెందిన అంగజాల గీత, వైస్ చెర్మన్‌గా ఏలంపల్లి గోవర్ధన్‌రెడ్డితో పాటు మరో 17 మందితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి గౌరు వెంకట్‌రెడ్డితో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న మినీలారీ

పాణ్యం: మండల పరిధిలోని సుగాలి మెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలు.. తెల్లవారు జామున 2 గంటల సమయంలో మినీలారీ అధిక వేగంతో వెళ్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నట్లు చెప్పారు. ఈ ఘటనలో మినీలారీ ముందు భాగం దెబ్బతినడంతో డ్రైవర్‌కు గాయాలైనట్లు వివరించారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను తొలగించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



సి.బెళగల్: మండల కేంద్రంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. గ్రామంలోని కొటారుమిట్ట ప్రాంతంలో శ్రీ రంగస్వామి గుడి దగ్గరున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తెలుగు చంద్రన్నకు చెందిన ఆవు మేత మేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును పక్కకు లాగి చూడగా అప్పటికే మృతి చెందిన ట్లు గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చా రు.విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవు మృతి చెందడంతో రూ.50 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

రెవెన్యూ అధికారిగా వాజిద్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారిగా వాజిద్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులుగా జునీద్, ఇశ్రాయేలు ఉన్నారు. అయితే నగర విస్తీర్ణం పెరగడంతో పాటు పలు కాలనీలు విలీనం చేయడంతో వార్డుల సంఖ్య పెరిగింది. అయినా ఒకరిద్దరితో రెవెన్యూ పాలనను కొనసాగించారు. శివారు కాలనీలు పెరగడం ఇళ్ల అసెస్‌మెంట్ల సంఖ్య 1.39 లక్షలు దాటడంతో అన్ని వ్యవహారాలు చూసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో అదనంగా మరో రెవెన్యూ అధికారిని నియమించారు. పాలన సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వాజిద్‌కు రెవెన్యూ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పని విభజన చేసిన కమిషనర్ ఆయనకు పాణ్యం పరిధిలోని 19, 20, 21 వార్డులు, 28, 34 వార్డులు, 86వ పేట, 87వ పేట అలాగే 103 నుంచి 127 వరకు పేటలను కేటాయించారు.

13న ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(సెంట్రల్):అమీలియో హాస్పిటల్ వారి సహకారంతో ఈనెల 13న జర్నలిస్టుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు మీసాల రామస్వామి కోరా రు. ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఇన్‌చార్జ్ డీఆర్వోతో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కలెక్టరేట్‌లోని పాదుపు భవన్‌లో జరిగే ఉచిత శిబిరానికి జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

- కూటమి కుట్రలతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- నిధుల విడుదల లేక అర్ధాంతరంగా ఆగిన నాడు–నేడు పనులు
- అరకొరగానే స్టూడెంట్ కిట్లు మంజూరు
- నేటి నుంచి తెరచుకోనున్న బడులు

బడి.. సమస్యల సుడి



కోడుమూరు బాలుర హైస్కూల్లో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం



కల్లపరిలో నిలిచిపోయిన హైస్కూల్ నిర్మాణం



రామాపురంలో అసంపూర్తిగా ప్రాథమిక పాఠశాల

కోడుమూరు రూరల్: పాఠశాలలు పునఃప్రారంభం కానున్న వేళ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు తిష్టవేశాయి. కోడుమూరు మండలంలో మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలలుండగా 8940 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ పాఠశాల ప్రారంభం నాటికి వారికి అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు, యూనిఫాం, షూ, స్కూల్ బ్యాగు వంటివి పూర్తిగా అందించేది. అయితే కూటమి ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా పాఠశాలలు ప్రారంభమవుతున్నా ఇప్పటివరకు పుస్తకాలను మాత్రమే ఆయా పాఠశాలలకు సరఫరా చేయగా, యూనిఫాం, స్కూల్ బ్యాగులు, షూ వంటి వాటిని చాలా స్కూళ్లకు సరఫరా చేయలేదు. దీంతో పాఠశాల ప్రారంభం రోజున అరకొరగానే విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేయనున్నారు.

పూర్తిగాని అదనపు తరగతి గదులు

జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులను కల్పించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకం కూటమి పాలనలో పూర్తిగా నిర్వీర్యమైంది. నాడు–నేడు –1, 2 విడతల కింద కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని కల్లపరి గ్రామంలో హైస్కూల్ విద్యార్థుల కోసం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. కోడుమూరు బాలు ర హైస్కూల్లో నిర్మిస్తున్న 9 అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా నిధుల లేమితో ఇంతవరకు పూర్తి కాలేదు. దీంతో చాలీచాలని గదుల్లోనే విద్యార్థులు చదువులను సాగదీయాల్సిన దుస్థితి దాపురించింది.

రామాపురంలో చెట్ల కింద చదువులే దిక్కు

కోడుమూరు మండలం రామాపురంలో గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలమైపోవడంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద నూతన పాఠశాల గదులను నిర్మించేందుకు తలపెట్టింది. అయితే ప్రభుత్వం మారడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాల నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో గత్యంతరం లేక ఉపాధ్యాయులు గ్రామంలోని గుడి, చెట్ల కిందనే విద్యార్థులకు పాఠాలను బోధిస్తూ వచ్చారు. అయితే వేసవి సెలవులనంతరం కూడా పాఠశాల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఈ ఏడాది కూడా తమ పిల్లలు చెట్ల కిందనే చదువుకోవాలా అని రామాపురం గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

పుస్తకాలను పంపిణీ చేశాం

జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను అందించాం. విద్యార్థులకు సంబంధించి యూనిఫాంలు, బ్యాగులు మంగళవారం రాగా, ఒకటి రెండు రోజుల్లో పాఠశాలలకు అందజేస్తాం. విద్యార్థులకు సంబంధించిన బూట్లు ఇంకా రావాల్సి ఉంది.

– తైమూర్ బాషా, ఎంఈఓ, కోడుమూరు

అడ్డదిడ్డంగా పెరిగిన కంపచెట్లు



బస్తిపాడు జెడ్పీ పాఠశాల కాంపౌండ్ చుట్టూ పెరిగిన కంప చెట్లు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ దుస్థితి ఇది. పాఠశాల కాంపౌండ్ వాల్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలకు రావడానికి ముళ్లపొదలతో ఇబ్బందిగా మారనుంది. వర్షాకాలం కావడంతో పిచ్చిమొక్కల మధ్య విషపురుగులు సంచరిస్తుంటాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కాంపౌండ్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

సి.బెళగల్: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నాయకులు భూమి పూజ నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి సి.బెళగల్ నుంచి సంగాల గ్రామం వరకు రూ.3 కోట్ల నాబార్డు నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పలుకుదొడ్డి గ్రామంలో ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, భూమి పూజ చేశారు. అదేవిధంగా సి.బెళగల్‌లో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.99 లక్షలతో ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, సంగాల సర్పంచ్ హనుమంతు, ఎంపీడీఓ రాణెమ్మ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు మహేశ్వరరెడ్డి, కర్రెన్న, శ్రీనివాసులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్, సీసీ రోడ్డు ప్రారంభం

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి రోడ్డు నుంచి బైన్‌దొడ్డి గ్రామానికి ఉపాధి నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం సాయంత్రం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. పీఆర్‌ఐ డీఈఈ కర్రెన్న, ఎంపీడీఓ రాముడు, మండల ఇంజినీరు గంగరాజు, ఈఓఆర్డీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

☛ గూడూరు మండలం గుడిపాడులో కుడా నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన చౌదరి, ఈఓఆర్డీ లలిత, సర్పంచు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు



కోడుమూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజు



సి.బెళగల్‌లో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ పురుషోత్తం



గడివేములలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈఓ కోటయ్య

కోడుమూరు రూరల్: కోడుమూరు తహసీల్దార్‌గా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌నాయక్‌ను గూడూరు తహసీల్దార్ నియమించగా, తుగ్గలిలో డీటీగా పనిచేస్తున్న నాగరాజును కోడుమూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జిల్లా అధికారులు నియమించారు. అలాగే గూడూరు మండల తహసీల్దార్‌గా వెంకటేష్‌నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

సి.బెళగల్: మండలానికి నూతనంగా నియామకం అయిన తహసీల్దార్ వెంకటలక్ష్మి బుధవారం విధుల్లో చేరారు. ఆమె కర్నూలు అర్బన్ మండలం నుంచి సి.బెళగల్‌కు బదిలీపై వచ్చారు. అదేవిధంగా మద్దికెర మండలం నుంచి డిప్యూటేషన్‌పై మండలానికి నియామకం అయిన డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం సైతం మండల రెగ్యులర్ డీటీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలతో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు అభినందనలు తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

బాధ్యతల స్వీకరణ అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ పురుషోత్తంతో కలిసి వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సర్వే సహాయకులతో సమావేశం నిర్వహించి మా ట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటు లో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గ్రామస్థాయిలో పరిష్కారం అయ్యేలా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

గడివేముల: గడివేముల మండల విద్యాశాఖాధికారి-1గా కోటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న ఎంఈఓ విమలా వసుంధరదేవి రిటైర్ కావడంతో పాణ్యం ఎంఈఓగా పనిచేస్తున్న కోటయ్యను ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ మేరకు ఎంఈఓ-2 రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలను పరిశీలించినట్లు వెల్లడించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



గంగమ్మకు పూజలు చేసేందుకు బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కోడుమూరు రూరల్: వ్యవసాయంలో చేదోడుగా ఉండే వృషభాలకు, వ్యవసాయ పనిముట్లకు రైతన్నలు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఎద్దులను శుభ్రంగా కడిగి వాటి కొమ్ములకు, ఎద్దుల బండ్లకు, వ్యవసాయ సామగ్రికి రంగులు వేశారు. ఎద్దులను అందంగా అలంకరించుకొని పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించి వానలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, వ్యవసాయం కలిసి రావాలని కోరుకుంటూ వ్యవసాయ పనులను ప్రారంభించారు. సాయంత్రం ఎద్దులను అందంగా అలంకరించుకొని మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం కోడుమూరులో గంగపుత్రులంతా తమ ఇళ్ల వద్ద నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గూడూరు రోడ్డువైపు గల గంగమ్మ ఆలయంలో సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ సహాయ కార్యదర్శి బాలవెంకట్ తదితరులు పాల్గొని ఎడ్లకు పూజలు చేసి పొలాన్ని దున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు ఎలాంటి భరోసా లేదని వాపోయారు. రైతులకు వెంటనే పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, కృష్ణ, రమేష్, నారాయణ, మాసుమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు



పిన్నాపురంలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల ప్రజలు బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది ఏరువాక పౌర్ణమికి వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు పంటలను విత్తుకునే పనులలో బిజీగా ఉన్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం రైతులు ఎద్దులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు వేసి అలంకరించి ఊరేగింపు చేశారు. గుండ్రేవుల గ్రామంలో తుంగభద్ర నదీతీరంలోని గంగాదేవి ఆలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన బుధవారం ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేశారు. జనరల్ మెడిసిన్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ విభాగాలను పరిశీలించి రోగుల వివరాలు,మాడ్యూల్ డేటా ఎంట్రీ, వైద్యుల సమయపాలనపై ఆరా తీశారు. ఓపీకి వచ్చే రోగుల రిజిస్టర్‌ను పరిశీలించి ఈ–హాస్పిటల్‌లో రోగుల ఈ–మాడ్యూల్ ఎంట్రీ అయ్యేలా చూసుకోవాలన్నారు. అత్యవసర విభాగంలో ఈ–హాస్పిటల్ మాడ్యుల్‌లో ఓపీ, ఐపీ ఎంట్రీ అయ్యేలా చూసుకోవాలని చెప్పారు. సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రాజశేఖర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నీళ్ల ట్యాంకు ఎక్కి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: గూడూరులో నగర పంచాయతీ కార్మికులు బుధవారం వినూత్న రీతిలో నీళ్ల ట్యాంకు ఎక్కి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారంలో భాగంగా నెల రోజుల నుంచి గూడూరు నగర పంచాయతీ కార్మి కులు విధులను బహిష్కరించి నిరవధిక దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఆరవింద్, మధు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో భాగంగా నెల రోజుల నుంచి నిరవధిక దీక్షలు చేస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంటు చేయడంతో పాటు, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా జీతాలను నెల నెలా సక్రమంగా చెల్లించి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మరింత ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నగర పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పంట సాగు పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు, కొండజుటూరు, పాణ్యం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు, సుధాకర్, మహేశ్వరమ్మ మాట్లాడుతూ.. రైతులు పంటలు సాగు చేసే సమయంలో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. భూసార ఆధారిత ఎరవులు అవసరమైన మేరకు వాడుకోవాలని సూచించారు. పోటీతత్వంతో అధికంగా ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. కంది, వేరుశనగ, కొర్ర, వరి తదితర పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యాన పంటల ద్వారా అధిక లాభాలు సాధించేందుకు మేలు రకమైన విత్తన ఎంపిక ముఖ్యమన్నారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

విత్తనాలను అధిక ధరకు అమ్మితే చర్యలు



దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ నిర్ణయించిన రేట్లకు కాకుండా అధిక ధరకు పత్తి విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని విత్తన దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఐదు రకాల పత్తి విత్తన నమూనాలను ఏఓ సేకరించి నాణ్యత ప్రమాణాల నిమిత్తం అమరావతి సిట్ ల్యాబ్‌కు తరలించారు. ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రైతులకు రసీదులివ్వాలని ఏఓ దుకాణదారులను ఆదేశించారు.

ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులంతా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి తమ వివరాలతో కూడిన ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు.

పర్యాటక శాఖ డీఎంగా సువర్ణకుమారి

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు సమీపంలో నెలకొల్పిన రాక్‌గార్డెన్ రిసార్ట్‌కు పర్యాటక శాఖ డిప్యూటీ మేనేజర్‌గా సువర్ణకుమారిని నియమిస్తూ జిల్లా పర్యాటక అధికారులు ఉత్తర్వులు జారీ చేశా రు. ఇప్పటివరకు యూనిట్ మేనేజర్‌గా పనిచేస్తున్న జీవన్‌రాయ్‌కి ఉన్నతాధికారిగా కర్నూలు డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న సువర్ణకుమారిని ఓర్వకల్లు హరితా రాక్‌గార్డెన్ డిప్యూటీ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా బ్రహ్మానంద రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు.



స్విమ్మింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో అధికారులు

స్విమ్మింగ్‌లో ప్రతిభ

కల్లూరు: నగరంలోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన జిల్లా స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహయ్యఆచారి, కార్యదర్శి రామకృష్ణయాదవ్, కోచ్ నటరాజరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మంది పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లాక్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్, సీఈఓ డాక్టర్ హరికృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంలో లక్ష్యాలను సాధించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పండ్ల తోటల పెంపకంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఓ సిద్దీశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరానికి 250 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 200 ఎకరాలను గుర్తించగా, మిగతా 50 ఎకరాలను వారం రోజుల్లో గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులకు ప్రధానంగా మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, డ్రాగన్, నేరేడు, గంగిరేణితో పాటు, మునగ, మల్లె, గులాబీ వంటి 15 రకాల మొక్కలను సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు వారికి ఇష్టమైన చోట మొక్కలు తెచ్చుకుంటే రవాణా ఖర్చులతో సహా మొక్కల ఖరీదును ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. పండ్లతోటల పెంపకానికి ఇప్పటివరకు గుర్తించిన రైతుల వివరాలను జిల్లా పీడీ కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. ఆయా క్లస్టర్ల టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంలో నిలిచేలా..!



వీల్‌చైర్‌లో పరీక్ష కేంద్రానికి వస్తున్న డేవిడ్‌రాజు

పాణ్యం: ఓసారి డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ పరీక్ష రాసి స్వల్ప తేడాతో ఉద్యోగం కోల్పోయిన కర్నూలు వాసి జోసఫ్ డేవిడ్‌రాజు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. నడవలేని స్థితిలో ఉన్న డేవిడ్ పట్టుదలతో డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యాడు. బుధవారం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో హిందీ టీజీటీ పరీక్ష రాసేందుకు పోలీసు శాఖ, చెల్లెలి సహాయంతో బుధవారం పరీక్షకు హాజరయ్యాడు. డేవిడ్ సంకల్పాన్ని అక్కడున్న వారు కొనియాడారు. అభ్యర్థి వెంట డిపార్ట్‌మెంటల్ అధికారి సుబ్రమణ్యం, పోలీసు ఉన్నారు.